ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 08.07.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. నాచారంలో అంగన్‌వాడీ కేంద్రాల కొరకు నూతన బాలామృతం తయారీ ప్లాంటును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

2. తుమ్మిడిహెట్టి ఆధారిత ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

3. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే సింగరేణి సంస్థ నష్టాల్లోకి వెళ్ళిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు.

4. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల కంటే రాజకీయమే ముఖ్యమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

-------------------------------------

**medchal ముఖ్యమంత్రి**

నాచారంలో అంగన్‌వాడీ కేంద్రాల కొరకు నూతన 'బాలామృతం' తయారీ ప్లాంటును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. పోషకాహార లోపం లేని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా, చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలను ఈ ప్లాంట్ ద్వారా నిరంతరాయంగా అందిస్తామని సీఎం తెలిపారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా సకాలంలో ఆహారం అందించాలని అధికారులను

ఆదేశించారు. అంగన్‌వాడీలను చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ వేదికలుగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

**byte : cm revanth reddy**

**పీటీసీ – మేడ్చల్ మల్కాజ్ గిరి**

-------------------------------------------

**ఉత్తమ్**

తుమ్మిడిహెట్టి ఆధారిత ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన మాట్లాడుతూ, తక్కువ వ్యయం, తక్కువ విద్యుత్ వినియోగంతో దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే అసలు ప్రాజెక్టును తిరిగి అమలు చేస్తామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ పునాదులు పూర్తిస్థాయిలో బలోపేతం కాకముందే నీటిని నిల్వ చేయడం ప్రజల భద్రతకు ప్రమాదకరమని మంత్రి హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక, విద్యుత్ భారం పడిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో కలిసి త్వరలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించి పనులను వేగవంతం చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

**డెస్క్**

-------------------------------------

**రైతు భరోసా**

రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఏడో విడత నిధులను నిన్న విడుదల చేసింది. 7 నుంచి 8 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన 58 వేల 831 మంది రైతుల ఖాతాల్లో 259 కోట్ల 73 లక్షల రూపాయలను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ విడతలో 4 లక్షల 32 వేల ఎకరాల సాగుభూమికి రైతుభరోసా సాయం అందినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆరు విడతల్లో 7 ఎకరాల వరకు భూమి కలిగిన

రైతులకు నిధులు విడుదల చేయగా, నిన్న 7 నుంచి 8 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ సాయం అందించామని చెప్పారు.

**డెస్క్**

---------------------------------------

**పొంగులేటి**

రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు 360 కోట్ల రూపాయలతో తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తొలి విడతలో 263 కోట్ల రూపాయలతో 107 తహసీల్దార్, 10 ఆర్డీవో కార్యాలయాలు, 97 కోట్ల రూపాయలతో 48 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, మూడు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, రెండు డీఐజీ కార్యాలయాల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

**డెస్క్**

----------------------------------

**రామచందర్ రావు**

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే సింగరేణి సంస్థ నష్టాల్లోకి వెళ్ళిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడిన ఆయన, సింగరేణికి కేంద్ర ప్రభుత్వం 'తాడిచర్ల-II' బొగ్గు బ్లాక్‌ను కేటాయించడం తెలంగాణకు శుభవార్తని పేర్కొంటూ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ బ్లాక్ ద్వారా సంస్థకు రూ.64,000 కోట్ల ఆదాయంతో పాటు 1,200 మంది యువతకు ఉపాధి లభిస్తుందని, కేంద్రం తెలంగాణ భవిష్యత్తును బలోపేతం చేస్తోందని చెప్పారు. అలాగే, గత ప్రభుత్వ ధరణి పోర్టల్‌తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ భూ భారతిలోనూ అక్రమాలు జరిగాయని, వీటిపై తక్షణమే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

**పీటీసీ – హైదరాబాద్**

-------------------------------

**కేటీఆర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల కంటే రాజకీయమే ముఖ్యమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ మీద కక్షతో మేడిగడ్డ వద్ద నీటిని వృథా చేస్తూ రైతులను ఆగం చేయడం తగదన్నారు. లోటు వర్షపాతంతో పంటలు సాగుకాక అన్నదాత అల్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు ఆపి, గోదావరి జలాలను ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని, కాంగ్రెస్ కర్కశ పాలనను రైతులు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------------

**కేటీఆర్**

ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రం అప్పర్ మిడిల్ ఇన్ కం బెంచ్ మార్క్‌ను దాటి, దేశంలోనే ఈ హోదా సాధించిన అగ్ర ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా నిలవడం పట్ల బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే ఏమొచ్చింది అన్నవారికి, దివాలా రాష్ట్రమంటూ దుష్ప్రచారం చేసేవారికి ఈ అంతర్జాతీయ నివేదికే సమాధానమని పేర్కొన్నారు. కేసీఆర్ దార్శనిక పాలనలోనే గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా వృద్ధి చెందిందని, దరిద్రం తాండవించిన ప్రాంతం నేడు సిరిసంపదలతో తులతూగుతూ సంపన్న రాష్ట్రంగా అవతరించిందని తెలిపారు.

**పీటీసీ - హైదరాబాద్**

---------------------------------

**ముఖ్యమంత్రి - నివాళి**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రైతు సంక్షేమం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, విద్యా ప్రోత్సాహం వంటి రంగాల్లో వైఎస్సార్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు.

డెస్క్

----------------------------------

**రాజశేఖరరెడ్డి జయంతి**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పంజాగుట్టలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు తదితర నేతలు ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ పేదల పక్షపాతి అని, ఆయన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని భట్టి విక్రమార్క కొనియాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మొదటి నిమిషంలోనే రైతుల ఉచిత విద్యుత్ ఫైలుపై సంతకం చేసిన చిత్తశుద్ధి గల గొప్ప నాయకుడని, ఆయన అమలు చేసిన విప్లవాత్మక పథకాలు నేటికీ అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని గుర్తుచేశారు.

డెస్క్

----------------------------------------

**మంత్రి పొన్నం**

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లతో కలిసి రూ.12 కోట్లతో నూతన బస్ స్టాండ్, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి వైఎస్సార్ అడుగుజాడల్లో ప్రజాపాలన అందిస్తున్నారని, రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

డెస్క్

-----------------------------

**కోమటిరెడ్డి**

రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో 338 కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్

విధానంలో ఈ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇప్పటికే 85 కోట్ల రూపాయల విలువైన రహదారి పనులు పూర్తిచేశామని, మరో 275 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

**డెస్క్**

-------------------------------

**జూపల్లి**

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో పర్యాటక సలహా మండలి సభ్యులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విస్తృత ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**డెస్క్**

----------------------------------

**నోడల్ ఆఫీసర్**

హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే. విద్యాసాగర్ నిన్న బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సమక్షంలో మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఇప్పటివరకు స్టేట్ నోడల్ అధికారిగా పనిచేసిన దివ్య దేవరాజన్ పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో ఆమె విద్యాసాగర్‌కు బాధ్యతలను అప్పగించారు.

**డెస్క్**

-----------------------------------

**హరీష్ రావు**

నదుల్లో నీరున్నా మోటార్లు నడపకపోవడం ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల నిర్లక్ష్యమని, ఇందుకు వారికి ఏ శిక్ష వేసినా తప్పులేదని BRS నేత మాజీ మంత్రి హరీష్

రావు విమర్శించారు. దేవాదుల వద్ద ఎలాంటి అభ్యంతరాలు లేకున్నా మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబుకు గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు.

**డెస్క్**

------------------------------------

**కరీంనగర్**

కరీంనగర్ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది. 1,338 మంది బీఎల్ఓలు జిల్లావ్యాప్తంగా దాదాపు 10.78 లక్షల మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేశారని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. నగరంలోని 66 డివిజన్లలో ప్రతి 10 పోలింగ్ స్టేషన్లకు ఒక అధికారిని, రాజకీయ పార్టీల ప్రతినిధులను కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు.

**byte: Praful, commissioner**

**పీటీసీ - కరీంనగర్**

-----------------------------

**ఖమ్మం**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగుల కోసం జూలై 10న ఉదయం 10 గంటలకు ఖమ్మం టీటీడీసీలో మెగా సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి తెలిపారు. అర్హులు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరోవైపు వైరా మున్సిపాలిటీలో ఓటర్ల వివరాల సేకరణ, అవగాహన కల్పించే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలిస్తూ, ఓటు నమోదు ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**పీటీసీ - ఖమ్మం**

-----------------------------